సాక్షి
విశాఖపట్నం
ఆదివారం । 27 । ఆగస్టు । 2023

న్యూస్‌రీల్

నేడు, రేపు కేంద్ర మంత్రి పర్యటన

మహారాణిపేట: పోర్టు గెస్ట్‌హౌస్‌లో బస చేసిన కేంద్ర కెమికల్ అండ్ ఫెర్టిలైజర్స్ శాఖ సహాయ మంత్రి భగవంత్ క్యూబా ఆదివారం 8 గంటలకు అన్నవరం వెళతారు. శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి దర్శనం అనంతరం సింహాచలం వస్తారు. సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు సింహాచలంలోనే ఉంటారు. 5.30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి తిరిగి పోర్టు గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. 28న సోమవారం ఉదయం 9 గంటలకు గెస్ట్ హౌస్ నుంచి బయలు దేరి సాలిగ్రామపురంలోని సాగర్‌మాల కన్వెన్షన్ హాలుకు చేరుకుంటారు. ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు రోజ్‌గార్ మేళాలో పాల్గొంటారు. సాయంత్రం 5.45 గంటలకు విమానంలో తిరిగి ఢిల్లీ వెళ్తారు.

సిటీకి ఐదుగురు సీఐలు



దొండపర్తి: విశాఖ రేంజ్‌లో వీఆర్‌లో ఉన్న ఐదుగురు సీఐలను విశాఖ నగరానికి కేటాయిస్తూ డీఐజీ హరికృష్ణ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్.కాంతారావు, ఆర్.సోమేశ్వరరావు, కె.సురేష్, ఎస్.షణ్ముఖరావు, సిహెచ్.వెంకటరావులు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మకు రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

టౌన్ ప్లానింగ్‌లో పలువురికి పదోన్నతులు



డాబాగార్డెన్స్: జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగంలో పలువురు అధికారులకు పదోన్నతులు కల్పించి వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు. అసిస్టెంట్ డైరెక్టర్లకు నుంచి డిప్యూటీ డైరెక్టర్ హోదాతో పదోన్నతి కల్పించి.. జీవీఎంసీ అసిస్టెంట్ సిటీ ప్లానర్ కె.వెంకటేశ్వరరావును వీఎంఆర్‌డీఏ ప్లానింగ్ అధికారిగా బదిలీ చేశారు. మరో అసిస్టెంట్ సిటీ ప్లానర్ కె.జయరాంను విశాఖలోని రీజినల్ డిప్యూటీ డైరెక్టర్‌గా నియమించారు. గాజువాక ఏసీపీ సంపూర్ణ మహాపాత్ర బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి బదిలీ కాగా, అనకాపల్లి ఏసీపీ అరుణవల్లిని రాజమండ్రి రీజినల్ డిప్యూటీ డైరక్టర్‌గా బదిలీ చేశారు. జీవీఎంసీలో టీపీవోలుగా పనిచేస్తున్న శ్రీలక్ష్మి, రామకృష్ణలకు అసిస్టెంట్ సిటీ ప్లానర్ హోదా కల్పిస్తూ.. జీవీఎంసీలోనే పోస్టింగ్ ఇచ్చారు. బొబ్బిలిలో పనిచేస్తున్న ఎస్.వెంకటేశ్వరరావు, నందిగామలో పనిచేస్తున్న ఝాన్సీరాణిని ఏసీపీగా పదోన్నతి కల్పించి జీవీఎంసీలో పోస్టింగ్ ఇచ్చారు.

30న ఏయూలో మినీ జాబ్ మేళా

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్, గైడెన్స్ బ్యూరో ఆధ్వర్యంలో ఈ నెల 30న మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ చీఫ్ కె.దొరబాబు తెలిపారు. వరుణ్ మోటార్స్ లిమిటెడ్‌లో 30 సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఎవాల్యూయేటర్ ఖాళీలు ఉన్నాయని, ఐటీఐ డిప్లమో(మెకానికల్), ఏదైనా డిగ్రీ చేసిన వారు అర్హులన్నారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్‌కి రూ. 15,500 నుంచి రూ.27 వేల వరకు, ఎవాల్యూయేటర్‌కి రూ.14వేల నుంచి 20 వేల వరకు వేతనంగా అందిస్తామన్నారు. మెడ్‌ప్లస్ ఫార్మా లిమిటెడ్‌లో ఫార్మసిస్ట్, ఫార్మసీ ఎయిడ్, ఫార్మసీ అసిస్ట్, వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్, డెలివరీ బాయ్, ఆడిట్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు 140 వరకు భర్తీ చేస్తామన్నారు. ఎస్ఎస్‌సీ, ఫార్మసీ కోర్సులు చదివిన వారు అర్హులన్నారు. వీరికి వేతనంగా రూ.11 వేల నుంచి రూ.15 వేల వరకు అందిస్తామన్నారు. పై ఉద్యోగాలకు 20 నుంచి 35 ఏళ్ల లోపు వయసు ఉన్న వారు అర్హులన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ వివరాలను www.ncs.gov.inలో నమోదు చేసుకోవాలని, ఇతర సమాచారం కోసం 96660 92491లో సంప్రదించాలని సూచించారు.

'జగనన్న భూ హక్కు సర్వే' అమోఘం

- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కితాబు
- ఆనందపురం, పద్మనాభం మండలాల్లో పర్యటన
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరు పరిశీలన



శొంఠ్యాంలో మహిళా రైతులతో మాట్లాడుతున్న కమిటీ చైర్‌పర్సన్ కనిమొళి, సభ్యులు

ఆనందపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును శనివారం గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ విభాగాల పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ పరిశీలించింది. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు సర్వే భూ రక్ష పథకం అమలు తీరును తెలుసుకుని వినూత్నంగా ఉందని కితాబిచ్చింది. స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ కనిమొళి కరుణానిధి, 11 మంది సభ్యులు ముందుగా శొంఠ్యాంలో మిషన్ అమృత్ సరోవర్ పథకం కింద రూ.18 లక్షలతో అభివృద్ధి చేసిన రామ్‌సాగర్ చెరువును సందర్శించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద కూలీలే చెరువును అభివృద్ధి చేసినట్టు అధికారులు వారికి వివరించారు. అనంతరం కమిటీ సభ్యులు మహిళా రైతులతో సమావేశమై.. చెరువు ఆయకట్టు కింద పండించిన కూరగాయలు, ఆకు కూరలు, పువ్వులు తదితర ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించారు. చెరువును అభివృద్ధి చేయడం వల్ల భూగర్భ జలాలు పెరగడంతో పాటు సాగు నీటి సమస్యను అధిగమించామని మహిళా రైతులు కమిటీకి వివరించారు. ఉపాధి హామీ పథకంలో పని దినాలను 150 రోజులకు పెంచడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు.

- చందక నుంచి జగన్నాథపురం మీదుగా పందలపాక వరకు పీఎంజీఎస్‌వై పథకం నిధులు రూ.3 కోట్లతో నిర్మించిన తారు రోడ్డును కమిటీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. చందక పంచాయతీలోని జగ్గరాజుపాలెంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు సర్వే భూరక్ష పథకం స్టాల్‌ను కమిటీ పరిశీలించింది. మాన్యువల్‌గా చేసే సర్వే విధానం, రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న డ్రోన్ సర్వేకు గల తేడాలను కమిటీ సభ్యులు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డ్రోన్ సర్వేలోఎటువంటి తేడా రాదని, దీని వల్ల ఎన్నో ఏళ్లుగా ఉన్న భూ సమస్యలు క్షేత్ర స్థాయిలోనే పరిష్కారమవుతున్నాయని అధికారులు కమిటీకి వివరించారు. రైతు భరోసాలో భాగంగా పీఎం కిసాన్ కింద రూ.6వేలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.7,500 చొప్పున ఏడాదికి రూ.13,500 సాయం అందుతోందని రైతులు తెలిపారు. పథకాల అమలు పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన బృంద సభ్యులు.. శొంఠ్యాం రోడ్డుకు ఇరువైపులా ప్రయోగాత్మకంగా రైతులు నాటిన మామిడి మొక్కలను పరిశీలించారు.

రెడ్డిపల్లిలో..

పద్మనాభం: రెడ్డిపల్లిలోని సచివాలయాన్ని పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులు సందర్శించి.. సచివాలయాల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెండున్నర ఎకరాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా అడపా రాంబాబు, పల్లంటి వరలక్ష్మి సాగు చేస్తున్న సపోటా మొక్కలను పరిశీలించారు. సచివాలయంలో ప్రాంగణంలో రూ.50 వేలతో నిర్మించనున్న వర్షపు నీటి సేకరణ కేంద్రానికి శంకుస్థాపన చేశారు. సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు. స్వయం సహాయక సంఘాల సభ్యులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. మండల సమాఖ్య ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు.



జగ్గరాజుపాలెంలో భూ రీ సర్వే వివరాలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ కనిమొళి, సభ్యులు

పర్యటనలో స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎ.కె.పి. చినరాజ్, రాజీవర్ దివేర్, మహమ్మద్ జావేద్, డింపుల్ యాదవ్, కడాడి వీరన్న, నారాంభాయి రాథ్వా, నరేంద్రకుమార్, తలారి రంగయ్య, అజయ్ ప్రతాప్ సింగ్, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్య కుమారి, స్పెషల్ కమిషనర్ ఎ.సిరి, అడిషనల్ కమిషనర్ సుధాకర్, ఉపాధి హామీ పథకం రాష్ట్ర డైరెక్టర్ చిన తాతయ్య, ల్యాండ్ సర్వే విభాగం రాష్ట్ర జేడీ ప్రభాకర్, ఆర్డీడీ కేజియా కుమారి, ఆర్డీవో భాస్కరరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, డ్వామా పీడీ సందీప్, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యులు కోరాడ వెంకటరావు, సుంకర గిరిబాబు, తహసీల్దార్‌లు ఎల్.రామారావు, శ్రీవల్లి, ఎంపీడీవోలు అడపా లవరాజు, విజయ్‌కుమార్, సర్పంచ్‌లు లెంక లావణ్య, బంక శ్రీను, నాయకులు బంక సత్యం, మజ్జి వెంకటరావు, లెంక రాంబాబు, విజినిగిరి అప్పలనాయుడు, పల్లా దుర్గ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా 5,141 రేషన్ కార్డులు

సాక్షి, విశాఖపట్నం : అర్హులైన వారికి కొత్తగా బియ్యం కార్డుల మంజూరు ప్రక్రియను జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ఏటా రెండు సార్లు జూన్, డిసెంబర్‌లో అర్హులకు కొత్త కార్డులు అందజేస్తోంది. ఇప్పటివరకు జిల్లాలో కొత్తగా 5,141 రైస్ కార్డులకు ఆమోదం లభించింది. తహసీల్దార్ల డిజిటల్ సంతకాల ప్రక్రియ పూర్తయింది. ఇప్పటివరకు 3,216 రైస్ కార్డులను ఆయా మండలాల్లో పంపిణీ చేసినట్లు డీఎస్‌వో గొండు సూర్యప్రకాష్ తెలిపారు. 723 రేషన్ కార్డులపై ఇప్పటికే తహశీల్దారుల డిజిటల్ సంతకాలు పూర్తయ్యాయనీ.. డౌన్‌లోడ్ చేసిన తర్వాత పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తామన్నారు. అదేవిధంగా మరో 1197 కార్డులు ఆయా మండలాల పరిధిలోని వలంటీర్ల వద్ద ఉన్నాయని.. వీటి పంపిణీ ప్రక్రియ దశలవారీగా నిర్వహిస్తున్నట్లు డీఎస్‌వో వివరించారు. జగనన్న సురక్షలో బియ్యం కార్డుల కోసం అనేక దరఖాస్తులు అందాయనీ.. వాటిని కూడా పరిగణనలోకి తీసుకొని అర్హులైన వారికి మంజూరు చేస్తున్నామని తెలిపారు. కార్డులు అందుకున్న వారిలో చాలా మందికి ఆగస్టు నెలకు సంబంధించి రేషన్ సరకులు పంపిణీ చేస్తున్నామనీ.. కొత్తగా కార్డులు తీసుకున్న వారి ధృవీకరణ పూర్తయితే.. సెప్టెంబర్ నెల రేషన్ తీసుకునేందుకు అవకాశం కల్పించనున్నట్లు డీఎస్‌వో వెల్లడించారు. జీవీఎంసీ పరిధిలో ఏప్రిల్ నుంచి గోధుమ పిండి పంపిణీ చేస్తున్నామని, గ్రామీణ ప్రాంతాల కార్డుదారులకు కూడా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని తెలిపారు.

మురిపించిన వాన!

- తడిసి ముద్దయిన నగరం
- నేడు కూడా కురిసే అవకాశం



సాక్షి, విశాఖపట్నం: కొద్దిరోజుల విరామం తర్వాత శనివారం వాన కురిసింది. వేకువజాము నుంచే చిరుజల్లులతో మొదలైన వర్షం తెల్లారేసరికి మరింత ముదిరింది. అలా సాయంత్రం వరకు అడపాదడపా కురుస్తూనే ఉంది. విశాఖ నగరాన్ని తడిసి ముద్ద చేసింది. ప్రస్తుతం వర్షాకాలమే అయినప్పటికీ ఇటీవల కాలంలో వేసవిని తలపించేలా ఎండలు కాస్తున్నాయి. సాధారణంకంటే 4–5 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఉష్ణతాపాన్ని వెదజల్లుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో జనం ఊరట చెందుతున్నారు. పైగా ఈదురుగాలులు లేకుండా ప్రశాంతంగా కురిసిన వర్షానికి జిల్లా వాసులు ఒకింత ఉపశమనం పొందారు. కురిసింది తేలికపాటి వర్షమే అయినప్పటికీ రోడ్ల పక్కన, ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు అమ్మకాలు జరగక ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు మోస్తరుగా ప్రభావం చూపుతున్నాయి. దీని ఫలితంగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో ఆది, సోమవారాల్లోనూ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగుతాయని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు 'సాక్షి'కి చెప్పారు.

ప్రాంతం	వర్షపాతం (మి.మీల్లో)
దువ్వాడ	17.2
మల్కాపురం	13.2
పెదగంట్యాడ	10.7
గోపాలపట్నం	10.2
అక్కిరెడ్డిపాలెం	10.0
శ్రీహరిపురం	9.0
విశాఖ రూరల్	9.0
వేపగుంట	8.5

రైతాంగానికి మేలు

విశాఖ జిల్లాలో ఆగస్టు నెలలో వర్షాలు కురవకపోవడంతో వరి నాట్లు జరగడం లేదు. జిల్లాలో ఖరీఫ్ సీజనులో వరి సాధారణ విస్తీర్ణం 11,496 హెక్టార్లకు గాను ఇప్పటి వరకు ఐదు వేల ఎకరాల్లో అంటే 45 శాతం లోపు మాత్రమే వరి నాట్లు పడ్డాయి. వరి నారు సిద్ధంగా ఉన్నా.. వర్షాలు కురిస్తే నాట్లు వేద్దామని రైతులు కొన్నాళ్ల నుంచి ఎదురు చూస్తున్నారు. ఈ తరుణంలో కురుస్తున్న వానలు రైతాంగానికి మేలు చేయనున్నాయి. మరో రెండు రోజులు వర్షాలు కొనసాగితే ఊడ్పులకు వీలవుతుందని రైతులు ఆశాభావంతో ఉన్నారు.

సాక్షి మీడియా గ్రూప్, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో

గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

- సెప్టెంబర్ 3వ తేదీ ఉదయం 9 నుంచి 12.30 వరకు..
- టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్

సాక్షి ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఎత్తున గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. దాదాపు 1000 వరకు గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో.. గ్రామీణ విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్ రాష్ట్రంలోని ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఆర్.సి ఎగ్జామ్స్‌తో కలిసి సెప్టెంబర్ 3వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విశాఖలోని రామాటాకీస్ దరి రీజనల్ కంటి ఆస్పత్రి ఎదురుగా గల డా.బి.ఆర్.అంబేడ్కర్ భవన్‌లో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెల్సిందే. త్వరలోనే వెయ్యికి పైగా గ్రూప్ 2 ఉద్యోగాలకు నోటిఫికేషన్ రానుండటం.. దీనికి తోడు గ్రూప్–2కు కొత్త సిలబస్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఈ అవగాహన సదస్సు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనుంది. అవగాహన సదస్సు, టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులు ముందుగా 8985094499 ఫోన్ నెంబర్‌కు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపాలి.

వేదిక:
డా.బి.ఆర్.అంబేడ్కర్ భవన్, రామాటాకీస్ దరి రీజనల్ కంటి ఆస్పత్రి ఎదురుగా విశాఖపట్నం

సమయం :
ఉదయం 9 నుంచి 12.30 వరకు

వివరాలు పంపించాల్సిన ఫోన్ నెంబర్ 8985094499

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.59,450
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.54,500
వెండి(కిలో):	రూ.80,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్)	: రూ.127
స్కిన్	: రూ.224
స్కిన్‌లెస్	: రూ.234

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	480.00
విజయనగరం	484.00
శ్రీకాకుళం	484.00

ప్రాణం తీసిన అతి వేగం

- డివైడర్‌ను కారు ఢీకొన్న ఘటనలో విద్యార్థి మృతి
- మరో ఇద్దరికి గాయాలు

కొమ్మాది: అతివేగం ఓ విద్యార్థి ప్రాణం తీసింది. అతని నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా మరో ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. భీమిలి బీచ్‌రోడ్డులో చోటుచేసుకున్న ఈ ఘటన ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. భీమిలి పోలీసులు తెలిపిన వివరాలివీ.. లాసన్స్‌బే కాలనీకి చెందిన పెండ్యాల ప్రఖ్యాత్(20), సీతమ్మధారకు చెందిన కొల్లా అఖిలేష్, ఎండాడకు చెందిన ఆర్.సాయిలక్ష్మి స్నేహితులు. రుషికొండలోని గీతం కళాశాలలో ప్రఖ్యాత్, అఖిలేష్ సీఎస్సీ మూడో సంవత్సరం.. సాయిలక్ష్మి బీబీఏ చదువుతున్నారు. వీరు ముగ్గురూ శనివారం ఉదయం కళాశాలలో కలుసుకుని ఒకే కారులో భీమిలిలో టిఫిన్ చేసేందుకు వెళ్లారు. తిరిగి వస్తుండగా ఐఎన్ఎస్ కళింగ సమీపంలో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టి.. అక్కడే ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రఖ్యాత్‌కు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే గీతం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. వెనుక సీటులో ఉన్న అఖిలేష్, సాయిలక్ష్మి గాయాలతో బయటపడ్డారు. వీరికి గీతంలో చికిత్స అందించి ఇంటికి పంపించేశారు. ప్రఖ్యాత్ అతి వేగంగా కారు నడుపుతూ అదుపు చేయలేక డివైడర్‌ను ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. ప్రఖ్యాత్ తండ్రి అరవింద్ నగరంలో బిజినెస్‌మన్. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. భీమిలి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రఖ్యాత్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్ఐ భరత్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రఖ్యాత్ (ఫైల్)



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

కథక్ కళా ద్వయం నళిని, కమలినికి 'వైశాఖీ' పురస్కారం



కథక్ నాట్య నిపుణులు నళిని, కమలిని

మద్దిలపాలెం: విశాఖ వేదికగా వచ్చే నెలలో జరగనున్న వైశాఖీ నృత్యోత్సవంలో ఢిల్లీకి చెందిన ప్రసిద్ధ కథక్ నృత్య కళా ద్వయం, పద్మశ్రీ పురస్కార గ్రహీతలైన సోదరీమణులు నళిని, కమలిని వైశాఖీ జీవన సాఫల్య పురస్కారం-2023కు ఎంపికయ్యారు. ఈ మేరకు నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఫెస్టివల్ డైరెక్టర్ బి.ఆర్.విక్రమ్ కుమార్ గౌడ్ ఓ ప్రకటనలో వెల్లడించారు. మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో సెప్టెంబర్ 15 నుంచి 17వ తేదీ వరకు వైశాఖీ నృత్యోత్సవం ఏర్పాటు చేశామని, 15న వీరికి పురస్కారం అందజేసి, ఘనంగా సత్కరిస్తామన్నారు. వారణాసి ఘరానాకు చెందిన గురు జితేంద్ర మహారాజ్ వద్ద శిక్షణ పొందిన నళిని, కమలిని.. నాట్య విన్యాసాలతో అనతికాలంలోనే విశ్వఖ్యాతిని ఆర్జించారన్నారు. టెంపుల్ కథక్ నృత్య రీతిలో విశేష ప్రావీణ్యం కలిగిన ఈ ద్వయం.. ఇంగ్లాడ్, జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్, అమెరికా, నార్వే, మిడిల్ ఈస్ట్ దేశాల్లో పలు చోట్ల నృత్య ప్రదర్శనలిచ్చారన్నారు. మన రాష్ట్రంలో ఈ కళా ద్వయం మొదటి ప్రదర్శన విశాఖలో ఏర్పాటు చేశామని, తమ నాట్య విన్యాసాలతో వారు కళా ప్రియులను కనువిందు చేయనున్నారని విక్రమ్‌కుమార్ వివరించారు.

మనపై మనకు నమ్మకంతోనే విజయం

డిప్యూటీ కలెక్టర్ ఎం.కృష్ణమూర్తి

సీతమ్మధార: మనం చేసే పని మీద మనకు నమ్మకం ఉన్న రోజే జీవితంలో అనుకున్న విజయాన్ని సాధిస్తామని డిప్యూటీ కలెక్టర్ ఎం.కృష్ణమూర్తి అన్నారు. ద్వారకానగర్‌లోని గాయత్రి అకాడమీలో శిక్షణ తీసుకుని.. డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగం పొందిన మడక కృష్ణమూర్తి సన్మానసభ శనివారం జరిగింది. అకాడమీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ. కృషి, పట్టుదలతో డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం సాధించిన కృష్ణమూర్తిని అభినందించారు. అకాడమీ డైరెక్టర్ ఎస్.వెంకట శ్రీనివాస్ మాట్లాడుతూ పోలీస్ శాఖలో కమ్యూనికేషన్స్ ఎస్ఐగా కృష్ణమూర్తి విధులు నిర్వర్తిస్తూనే.. తమ వద్ద శిక్షణ పొంది నేడు డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. కృష్ణమూర్తి మాట్లాడుతూ గ్రూప్స్‌లో ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ తదితర అంశాల్లో అకాడమీ ఫ్యాకల్టీ ఎంతగానో సహకరించారని తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్లు మధుసూదన్‌రెడ్డి, అనురాధ, పద్మావతి, మల్లిక కృష్ణమూర్తి పాల్గొన్నారు.



కృష్ణమూర్తిని సత్కరిస్తున్న అకాడమీ ప్రతినిధులు

నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువు పొడిగింపు

కొమ్మాది : నవోదయలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువును ఈ నెల 31 తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ కె.సంజయ్ తెలిపారు. అభ్యర్థులు www.nvs.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి సవరణ చేసుకునేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

వివాహితది హత్యే?

బీచ్‌రోడ్డు: పోలమాంబ ఆలయ సమీపంలోని ఎల్ఐసీ క్వార్టర్స్‌లో అనుమానాస్పదంగా మృతి చెందిన కళావతిది (41) హత్యే అని పోస్టుమార్టంలో తేలినట్టు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే మూడో పట్టణ పోలీసులకు హత్యే అని నివేదిక అందినా.. ఆదివారం మరోసారి మత్తు డాక్టర్ అభిప్రాయం తీసుకుని ఆ దిశగా విచారణ చేయనున్నట్లు తెలిసింది. అయితే కళావతిని భర్తే హత్య చేసినట్లు ఎటువంటి సాక్ష్యాలు ప్రస్తుతం లేకపోవడంతో.. విచారణ పూర్తిగా పోస్టుమార్టం నివేదికపైనే ఉండనుంది. ఆదివారం పూర్తి సమాచారం తెలిసే అవకాశం ఉంది.

పోలీస్ కారుణ్య నియామకాలపై సమీక్ష

అల్లిపురం: పోలీస్ కారుణ్య నియామకాలపై పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ సీఎం త్రివిక్రమ్ వర్మ ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో మరణించిన పోలీస్ కుటుంబాల దరఖాస్తులను పరిశీలించారు. ఏఓ, డీడీఓ సంబంధిత సిబ్బంది, పీఎస్‌పీ నోడల్ అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్‌ఏ జిల్లా కార్యవర్గ సభ్యుల ఎన్నిక

కంచరపాలెం: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్(ఏపీపీఎస్‌ఏ) విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యులను ఎంపిక చేసినట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు జె.సోమశేఖర్, పి.భాస్కరరావు, ఎం.శ్రీను తెలిపారు. కంచరపాలెంలోని గిరీశా చైతన్య ఇంగ్లిష్ మీడియం పబ్లిక్ స్కూల్‌లో శనివారం ఏపీపీఎస్‌ఏ, గాజువాక ఇండస్ట్రియల్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్(జీఐపీఎస్‌ఏ) సభ్యులు, ప్రైవేట్ స్కూళ్ల యాజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీపీఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల మనుగడ, అభివృద్ధికి ఎగ్జిక్యూటివ్ సభ్యులు కృషి చేయాలన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఏపీపీఎస్‌ఏ జిల్లా కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ కె.రామకృష్ణ, పి.మురళీసుందర్, ఎం శ్రీనివాసరావు, డి.వి శ్రీనివాసరావు, కె.తారకేశ్వరరావు, బి.శ్రీనువాసరావు, ఎస్.మురళీధర్, జె.రమేష్ నాయుడు, జి.జగన్నాధరావు, బి.అజేయ్‌కుమార్, ఎ.వాసుదేవరావు, కెఎన్ఎస్‌వి ఆర్ మూర్తి, సిహెచ్ శ్రీనివాసరావు ఎన్నికయ్యారు.



ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా కొత్త కార్యవర్గ సభ్యులతో అధ్యక్ష, కార్యదర్శులు

28, 29 తేదీల్లో శ్రీవారి పవిత్రోత్సవాలు

ఎంవీపీకాలనీ: శ్రీ వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలను ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించనున్నారు. ఈ నెల 28, 29 తేదీల్లో విశాఖ కార్తీక దీపోత్సవం టీమ్, వైదిక విపంచి, శ్రీవారి సేవ టీమ్, టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పవిత్రోత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు విశాఖ కార్తీక దీపోత్సవం టీమ్ ప్రతినిధి హిమాంశుప్రసాద్ తెలిపారు.

సండే క్లాసిఫైడ్స్ సాక్షి